ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 30 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:30 (ఆదివారం సాయంత్రం)
సహర్ 4:52 (సోమవారం ఉదయం)

• ఫటాఫట్

ఎస్సారెస్పీ కాలువల అభివృద్ధికి ప్రణాళికలు

వెంకటశివరాజు, ఏఈఈ



ఆంధ్రజ్యోతి: వేసవిలో ఎస్సారెస్పీ కాలువల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఏఈఈ: ఎస్సారెస్పీ డి86 కాలువలో నీటి సరఫరా పూర్తి కాగానే కాల్వల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేస్తాం. కాలువ డ్రాపులు, మైనర్ కాల్వల మరమ్మతుకు నివేదికలు పంపిస్తాం.

ఆంధ్రజ్యోతి: ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు భూములు ఎన్ని ఎకరాలు?

ఏఈఈ: రెండు మండలాలు కలిపి 32 వేల ఎకరాలకుపైగా డి86 కాల్వల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఓదెల మండలం చివరి వరకు 17వేలకు పైగా, కాల్వశ్రీరాంపూర్ 15వేల ఎకరాలకు పైగా భూములున్నాయి. వీలైన మేరకు చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం.


ఆంధ్రజ్యోతి: చివరి భూములకు నీరు అందుతుందా?

ఏఈఈ: ఓదెల మీదుగా కాల్వశ్రీరాంపూర్ చివరి ఆయకట్టు భూముల వరకు సాగునీరు అందుతుంది. ఆటంకాలను అధిగమిస్తూ నీరు అందేలా ప్రయత్నం చేస్తున్నాం. అలాగే బుధవారం నుంచి చివరి విడత సాగునీటిని విడుదల చేస్తాం.

- ఓదెల

పిల్లలు ఎందరున్నా.. పోటీకి అర్హులే?

- స్థానిక సంస్థల్లో ఇద్దరికి మించి పిల్లలుంటే పోటీకి అనర్హులు
- మున్సిపల్ ఎన్నికల్లో సడలింపు
- వచ్చే ఎన్నికల్లో ఆ నిబంధనను ఎత్తివేసే యోచనలో ప్రభుత్వం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలో ఇద్దరు పిల్లలు ఉండాలనే నిబంధనను సడలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్న వాళ్ల పోటీకి అనర్హులు అనే నిబంధనను సడలించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు కనబడుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తి వేయాలని ఎమ్మెల్సీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై మాట్లాడిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆ నిబంధనను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని సమాధానం ఇవ్వడంతో ఇద్దరు పిల్లల నిబంధనను సడలించే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ నిబంధన ఎత్తివేయాలని ఎప్పటి నుంచో వివిధ రాజకీయ పక్షాల నాయకులు కోరుతున్నారు. తాజాగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాలను పునర్ వ్యవస్థీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నది. జనాభా ప్రాతిపదికన స్థానాలను పెంచనున్నారు. దక్షిణ భారత దేశంలో కంటే ఉత్తర భారతదేశంలోనే జనాభా అధికంగా ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించారు.

● ఉమ్మడి జిల్లాలో ఉద్యమంగా కుటుంబ నియంత్రణ..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1999లో కలెక్టర్ దేబబ్రతకంఠ కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేపట్టారు. ఇద్దరు పిల్లలు ఇంటికి వెలుగు, తదితర నినాదాలతో అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లకు టార్గెట్లు పెట్టి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకునే విధంగా అవగాహన కల్పించారు. దీంతో వేల కుటుంబాలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకున్నారు. ఇప్పటికీ అదే విధానం కొనసాగుతోంది. ముగ్గురు పిల్లల్ని కనడం అరుదుగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు గల వారు పోటీ చేసేందుకు అనర్హులు అనే నిబంధనను 1995లో జరిగిన గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నుంచి అమల్లోకి తీసుక వచ్చారు. ఆ తర్వాత జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా దీనిని అమలు చేశారు. అప్పటి

(మిగతా 8వ పేజీలో)

కులం కట్టుబాట్లే హత్య చేయించాయి
● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యంరావు
6

పథకం ప్రకారమే యువకుడి పరువు హత్య
7
● హత్యకు ప్రోత్సహించిన భార్య, బావమరిది
● ముగ్గురు నిందితుల రిమాండ్

కాలువలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత
● ఎమ్మెల్యే విజయరమణారావు
8

'విశ్వావసు'కు స్వాగతం

● నేడు ఉగాది ● ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

సుల్తానాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): షడ్రుచుల సమ్మేళనం ఉగాది పర్వదినం.. తెలుగువారి తొలి పండుగ ఉగాది నుంచి తెలుగు నూతన సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఆదివారం క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకనున్నారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది లేదా యుగాది అనే పదాలు సంస్కృతం నుంచి వచ్చాయి. యుగ అనగా కాలమని, ఆది అంటే ఆరంభం అని అర్థం. రాశి ఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో ప్రజలు తెలుసుకుంటారు.

చైత్ర మాసం శుక్లపక్షం పాడ్యమి రోజున బ్రహ్మ జగత్తును సృష్టించాడని అంటారు. సోమకుడు అనే రాక్షసుడు వేదాలను ఎత్తుకుపోవడం వలన వాటిని తీసుకురావడానికి మత్స్యావతారం దాల్చిన విష్ణువు సోమ



కుడిని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పగించిన సందర్భమే ఉగాది అని పురాణాలు చెబుతున్నాయి. వసంత రుతువు కూడా ఇదే రోజున ప్రారంభమవుతుంది. ఉగాది పండుగ రోజు సూర్యోదయానికి ముందే నువ్వుల నూనెను ఒంటికి రాసుకొని స్నానం చేయాలి. నూతన వస్త్రాలు ధరించాలి. గడపలకు పసుపు రాసి, ద్వారాలకు మామిడి తోరణాలు కట్టాలి. చిన్నారులకు కొత్తబట్టలు వేసి మెడలో రకరకాల తినుబండారాలతో అల్లిన దండలను వేస్తారు.

ఉగాది పండుగ అంటేనే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది పచ్చడే. వేప పువ్వు, కొత్త బెల్లం, కొత్త చింతపండు, మామిడి కాయ, ఉప్పు, కారం మిశ్రమంతో పచ్చడిని తయారు చేస్తారు. షడ్రుచుల సమ్మేళనంగా చేసే పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తాయి. షడ్రుచులతో తయారు చేసిన పచ్చడి ఆరోగ్యాన్ని ఇస్తాయి. ఆలయాలను సందర్శించి పంచాంగ శ్రవణంలో పాల్గొంటారు.

పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలందరికీ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఉగాది (విశ్వవసునామ) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఒక్కరు ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ యేడు పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మంథని/రామగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మంథని, రామగిరి మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రామగిరి మండలాల్లో రూ.65 లక్షల డిఎంఎఫ్‌టీ నిధులతో సమీకృత అధికారుల సముదాయం, రూ.67 లక్షలతో కస్తూర్బా పాఠశాల ప్రహరీ, రోడ్డు పనులు, మంథని గోదావరితీరంలో రూ. 125 కోట్లతో వంతెన నిర్మాణం, మంథని గర్ల్స్ హైస్కూల్‌లో రూ.30లక్షలతో తరగతి గదుల పనులు, మంథని బస్టాండ్‌లో రూ.90 లక్షలతో మరమ్మతు, మంథనిలో సమీకృత అధికారుల సముదాయం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సమీకృత అధికారుల భవన నిర్మాణాలతో ప్రజలకు సేవ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మంథని గోదావరిలో వంతెన నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత వ్యాపారులకు, ప్రజలకు లాభం కల్పిస్తున్నట్లు తెలిపారు. రవాణా సౌకర్యం చేకూరే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు జవాబుదారితనం పనిచేసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యే విధంగా కృషి చేయాలన్నారు. పేద వారికే ఇందిరమ్మ గృహాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులు ప్రణాళికబద్ధంగా గృహ లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. చట్టానికి లోబడి మాత్రమే అధికారులు పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. రామగిరిలో పాఠకుల కోసం ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయం నిర్మిస్తామని అందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఎస్ఈ పీఆర్ చక్రవర్తి, డీఈ నవీన్‌కుమార్, ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఎస్టేట్ అధికారి ఐలయ్య, తహసీల్దార్ సుమన్, ఎంపిడివో శైలజారాణి, అధికారులు, పోలీసులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మంథనిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రామగిరిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కస్తూర్బా విద్యార్థినులతో మాట్లాడిన మంత్రి

రామగిరి: పన్నూరు కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థినులను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పలకరించారు. మంచిగా చదువుకోవాలని, సమయానికి అన్నం పెడుతున్నారా అని తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడి సమస్యలపై వినతిపత్రాన్ని స్వీకరించారు. మండలంలోని రాజాపూర్ భూనిర్వాసితులను కలుసుకున్నారు. ఓసీపీ-2 ప్రాజెక్టు వల్ల ఇబ్బందులను తెలుసుకున్నారు. నిర్వాసితులకు అండగా ఉంటానని హామీ నిచ్చారు. రాజాపూర్ గ్రామస్థుల సమస్యపై కలెక్టర్‌కు ఫోన్‌లో మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జిల్లాలో 96.06 శాతం పన్నులు వసూలు

పెద్దపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటి వరకు జిల్లాలో 96.06 శాతం పన్నులను వసూలు చేశామని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 266 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7కోట్ల 21లక్షల 8వేల 420 రూపాయల డిమాండ్‌కుగాను, 6కోట్ల 92లక్షల 68వేల 2రూపాయలు వసూలయ్యాయని తెలిపారు. ఇంకా రూ.28 లక్షల 40 వేల 238 వసూలు కావాల్సి ఉందన్నారు. ముత్తారం, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో వందశాతం, అంతర్గాంలో 99.11 శాతం, పెద్దపల్లిలో 98.26 శాతం, ఎలిగేడులో 97.92, పాలకుర్తిలో 97.47, రామగిరిలో 97.19, మంథనిలో 96.17 శాతం, సుల్తానాబాద్‌లో 95.33, ధర్మారంలో 94.61, ఓదెలలో 94.33, జూలపల్లిలో 88.5, కమాన్‌పూర్‌లో 84.58శాతం పన్నులు వసూలయ్యాయని తెలిపారు.

షెడ్యూల్ కులాలు, తెగల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

పెద్దపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెడ్యూల్ కులాలు, తెగల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం సంక్షేమ రంగంలో ఎస్సీ వర్గాలకు అందిస్తున్న సదుపాయాలను అదనపు కలెక్టర్ వివరించారు. అనంతరం చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో శిక్షపడేలా సాక్ష్యులను ప్రవేశ పెట్టాలన్నారు. ఎస్సీ ఎస్టీ సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ కేసులకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరుకు తహసీల్దార్ శ్రద్ధ వహించాలన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం పని దినాలు కల్పించాలని, వేసవి దృష్ట్యా పని ప్రదేశాలలో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అధికారులకు రోస్టర్ పాయింట్ ప్రకారం పదోన్నతులు పారదర్శకంగా వచ్చేలా వ్యవహరించాలని కోరారు. ఎస్సీలు హత్యకు గురైతే చట్టం ప్రకారం వారి కుటుంబానికి ఉద్యోగం, పెన్షన్, భూమి మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సకాలంలో పరిష్కరించాలని నేరస్తులను అరెస్టు చేయాలన్నారు. చైర్మన్,సభ్యులను అధికారులు, ఉద్యోగులు, ప్రజలు సన్మానించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, డీసీపీ కరుణాకర్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కే లక్ష్మీనారాయణ, కుశ్రం నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్, ఆర్‌డీఓలు గంగయ్య, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలు, అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

తాగునీటికి తిప్పలు

- అడుగంటిన భూగర్భ జలాలు
- ఆదుకోని మిషన్ భగీరథ
- వేసవి ప్రారంభంలోనే ఇబ్బందులు

గంగాధర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎండకాలం ప్రారంభంలోనే గ్రామాల్లో తాగునీటి సమస్య, ఎండిపోతున్న బావులు, అడుగంటిన భూగర్భ జలాలు, ఆదుకోని భగీరథ పథకంతో ప్రజలు అవస్థలపాలవుతున్నారు. గంగాధర మండలం సర్వారెడ్డిపల్లి, ఆచంపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నది. ఆచంపల్లిలో రెండు మంచి నీటి బావులు, 20 సింగిల్ ఫేస్ బోర్లు, మిషన్ భగీ రథ


ఆచంపల్లిలో తాగునీరు అందించే బోర్


మర్రిగడ్డ బావిలో అడుగంటిన భూగర్భ జలాలు

నీరు వస్తున్నా తాగు నీటికి తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా ఎస్సీ కాలనీకి ప్రతి యేటా నీటి సమస్య ఏర్పడుతోంది. గ్రామంలో వాడవాడలకు బోర్లు ఏర్పాటు చేయడంతో వోహెచ్ఆర్ ట్యాంకు నుంచి గ్రామంలోకి నీటిని సరఫరా చేయడం నిలిచిపోయింది. దీనికి తోడు గ్రామంలో ఎక్కువగా ఫ్లోరైడ్ ఉండగా పైపుల్లో ఫ్లోరైడ్ గడ్డకట్టి ఎక్కడి కక్కడా లీకేజీలు ఏర్పడ్డాయి. ఎనిమిది సంవత్సరా లుగా సగం గ్రామానికి వోహెచ్ఆర్ ట్యాంకు నుంచి నీరు సరఫరా చేయక ఫ్లోరైడ్‌తో పైపులు నిండిపోయింది. వాడవాడకు ఏర్పాటు చేసిన బోర్లలో ఏదో ఒక సమస్యతో చాలా వరకు బోర్లు పని చేయడం లేదు. దీంతో చేసేదేం లేక అదనంగా ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఇదే సమస్యతో వేసవిలో నీటికి ఇబ్బందులు పడుతూ కాలం వెల్లదీస్తున్నారు. గ్రామంలో కొత్త పైపులైను వేస్తే నీటి సమస్య తీరుతుందని గ్రామస్థులు చెపుతున్నారు. చిన్న గ్రామపంచాయతీకి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు జీతాలకు, ట్రాక్టర్ కిస్తీలకు, కరెంటు బిల్లులకు వినియోగిస్తున్నారు. గ్రామంలో 20 సింగిల్ ఫేస్ మోటార్లు నడుస్తుండగా గత 8 సంవత్సరాలుగా వస్తున్న కరెంటు బిల్లు రూ. 25 లక్షలకు చేరింది. ఈ బిల్లు ఎలా చెల్లించేదని కార్యదర్శి తలపట్టుకుంటున్నారు.

● క్వారీతో అడగంటిన భూగర్భ జలాలు

సర్వారెడ్డిపల్లి అనుబంధ గ్రామం మర్రిగడ్డ శివారులో గతంలో మంచినీటి బావి తవ్వారు. 17 గజాల లోతు బావిలో రెండు నెలలుగా కేవలం అరమీటరు నీరు ఊరుతుంది. బావి మోటర్ ఆన్ చేస్తే అరగంట మాత్ర మే వస్తున్న నీరు సరిపోవడంలేదు. బావికి రెండు వందల మీటర్ల దూరంలో క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయి. గతంలో సమృద్ధిగా నీరందించిన బావి క్వారీ తవ్వకాలతో క్రమక్రమేనా భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో గత మూడేళ్లుగా ఏప్రిల్‌లోనే ఎండిపోతోంది. రెండు రోజులకోసారి వస్తున్న మిషన్ భగీరథ నీటినే పొదుపుగా వాడుకుంటున్నారు. ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ముప్పిడి పల్లి బావి నుంచి సర్వారెడ్డిపల్లి, మర్రిగడ్డ, ముప్పిడి నర్సయ్యపల్లికి నీటిని సరఫరా చేస్తుండేవారు. ముప్పిడి నర్సయ్యపల్లి కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడగా ఈ బావి నీటిని సర్వారెడ్డిపల్లికి నిలిపి వేశారు. దీంతో సర్వారెడ్డిపల్లి, మర్రిగడ్డ గ్రామాలు వేసవిలో తీవ్ర నీటి కష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. పొలాల కోతలు పూర్తయితే వ్యవసాయ బావులవద్ద నుంచి నీటిని మోసుకు వస్తుంటారు. అయితే చెరువు సమీపంలో కొత్త బావి తవ్వించాలనే ప్రతిపాదన ముందుకు సాగడం లేదు. అధికారులు తాగునీటికి ఏర్పాట్లు చేసి వేసవిని గట్టెక్కించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మూడేళ్లుగా నల్లానీటికి గోసపడుతున్నం..

- కనుకమ్మ, ఆచంపల్లి



మా కాలనీకి మూడేళ్లుగా నల్లా నీరు వస్తలేవు. ఇక్కడ వాడకు ఒక్కటే బోరు ఉంది. దాని నుంచే అందరం నీరు తెచ్చుకుంటాం. కరెంటు ఉంటేనే మాకు నీరు. సొంతంగా పైపులు తెచ్చుకుని నీటిని డ్రంబుల్లో నింపుకుని వాడుకుంటాం. మా ఊరి నీళ్ల సమస్యను పరిష్కరించాలి.

కులం కట్టుబాట్లే హత్య చేయించాయి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యం రావు


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముత్యంరావు

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కులం కట్టుబాట్లు పరువు హత్యకు పురిగొలిపాయని సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యుడు ముత్యం రావు అన్నారు. శనివారం ముప్పిరితోటలో ఇటీవల పరువు హత్యకు గురై మృతిచెందిన పురేళ్ల సాయికుమార్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. హత్యకు దారితీసిన పరిస్థితులను మృతుడి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులం, కట్టుబాట్లు, మూఢత్వం పేరుతో సాయికుమార్‌ను హత్యచేశారని, ప్రేమించుకున్న పాపానికి అత్యంత దారుణంగా హత్య చేయడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి సంఘటనతో సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాలని, మళ్ళీ ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అందుకు ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ఏర్పాటుచేసి విచారణ త్వరితగతిన పూర్తిచే యాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్‌యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లాకమిటీసభ్యుడు అశోక్, నాయకులు మోదంపల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

హత్యపై విచారణ వేగవంతం చేయాలి

- ఏసీపీని అభ్యర్థించిన సాయికుమార్ మిత్రులు


ఏసీపీ కార్యాలయంలో సాయికుమార్ మిత్రులు

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో ఈనెల27నజరిగిన పూరెళ్ల సాయికుమార్(20) దారుణ హత్యపై విచారణ వేగవంతం చేయాలని శనివారం రాత్రి మృతుడు సాయికుమార్ మిత్రులు పెద్దపల్లి ఏసీపీ గజ్జికృష్ణను కలిసి అభ్యర్థించారు. గతంలో రెండుసార్లు సాయికుమార్‌పై దాడిచేసి హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆయనకు వివరించారు. హత్య చేసిన ముత్యం సది అలియాస్ సదయ్య, భార్య సమత, బావమరిది సారయ్య, హత్యకు ప్రేరేపించి, కుట్రపన్నిన చీకటి హరీష్, మల్లయ్యను కఠినంగా శిక్షించాలని ఏసీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడు మృతి

గంగాధర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గంగాధర పంచాయతీ కార్మికుడు షాహిద్(28) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు గతంలో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌తగిలి కుడిచేయి పోగొట్టుకున్నాడు. శనివారం చాతిలో నొప్పి వస్తుందని తెలుపగా అక్కడే పనిచేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది కాళ్లు, చేతులు రాపిడిచేసి 108కు సమాచారం అందించారు. జగిత్యాల ఏరియాఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

సుల్తానాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో శనివారం వృద్ధురాలు మృతిచెందింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన పత్రి నర్సయ్య, కళావతి దంపతులు ఐదు రోజుల కిత్రం గర్రెపల్లికి వచ్చారు. వీరు భిక్షాటన వృత్తిగా చేసుకుని జీవిస్తారు. శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. శనివారం ఉదయం ఎనిమిదన్నర గంటల ప్రాంతంలో కళావతిని నిద్రలేపగా చనిపోయి ఉంది. దీంతో మృతురాలి భర్త నర్సయ్య వెంటనే కూతురు కల్పనకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. తల్లి మృతిపట్ల అనుమానాలు ఉన్నాయంటూ కూతురు కల్పన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసుకున్నారు.

కెనాల్‌లో పడి గల్లంతైన చిన్నారి

రామగిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఇటుక బట్టీలో పనిచేసే ఒడిశా రాష్ట్రం అంగూల్ జిల్లాకు చెందిన కూలీ దాత్‌సాగర్ దంపతుల చిన్న కూతురు గేలిహీ(2) అనే చిన్నారి డి-83 కెనాల్‌లో శనివారం ప్రమాదవశాత్తు పడింది. ఇటుక బట్టీలో పని కోసం 7 నెలల క్రితం ఇక్కడకు వచ్చారు. దాత్‌సాగర్‌కు ముగ్గురు పిల్లలు. శనివారం కెనాల్ సమీపంలో ఆడుకుంటుండగా అదుపు తప్పిన చిన్నారి కెనాల్‌లో పడి గల్లంతైంది. కెనాల్ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ఎస్ఐ చంద్రకుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. గల్లంతైన చిన్నారి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

ఈత చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాక తిరుపతిగౌడ్ అనే కల్లు గీత కార్మికుడు శనివారం కల్లు గీయడానికి ఈత వనంలోకి వెళ్లాడు. ఎప్పటిలాగానే ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారికింద పడిపోగ తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ సెక్రెటరీ, సెక్యూరిటీగార్డు

- పండ్ల వ్యాపారుల లైసెన్స్‌కు రూ.2 లక్షలు డిమాండ్
- 60 వేలు తీసుకుంటుండగా ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారుల నుంచి 60వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదరి ఎ.పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డిని అవినీతి నిరోధకశాఖ అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో హోల్‌సేల్ పండ్లవ్యాపారులు ఏఎంసీలోనే షెడ్లు, గోదాంలలో మామిడి, బత్తాయి వంటి వివిధ రకాల పండ్లను నిలువ చేస్తారు. అక్కడి నుంచే జిల్లా వ్యాప్తంగా రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తారు. దీని కోసం హోల్‌సేల్ వ్యాపారులు ఏఎంసీ నుంచి లైసెన్స్ తీసుకోవాలి. నామినల్‌గా వెయ్యి నుంచి 2 వేల వరకు ఫీజు చెల్లించాలి. ఈలైసెన్స్‌ను వ్యాపారులు మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఏఎంసీలో హోల్‌సేల్ పండ్ల వ్యాపారం చేస్తున్న 15మంది లైసెన్స్‌ల గడువు ఈనెల31తో ముగుస్తుంది. రెన్యూవల్ చేయాలని నెల రోజుల నుంచి ఏఎంసీ సెక్రెటరీని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. ఒక్కో లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.2 లక్షలు ఇవ్వాల్సిందేనని కార్యదర్శి పురుషోత్తం డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని పండ్లవ్యాపారులు రిక్వెస్ట్ చేసినా తగ్గేదేలేదని చెప్పాడు. చివరికి శుక్రవారం పండ్ల వ్యాపారులతో తన చాంబర్‌లోనే ఒక సమావేశం ఏర్పాటుచేసి ఒక్కోవ్యాపారి 60వేల రూపాయలతోపాటు అన్ని డాక్యుమెంట్లు సమర్పిస్తే లైసెన్స్ రెన్యూవల్‌కు అంగీకరించాడు. దీంతో వ్యాపారులు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తిని ఆశ్రయించారు. కరీంనగర్ ఫ్రూట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మకాయలపాషా, అలియాస్ ఎండీ అబ్దుల్‌గఫార్ ఈ మేరకు ఫిర్యాదుచేశాడు. ఏసీబీ పోలీసుల సూచనతో మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిమ్మకాయల పాషా అలియాస్ అబ్దుల్‌గఫార్ 60వేల రూపాయలు లంచం డబ్బులు సెక్రెటరీ పురుషోత్తంకు అతడి చాంబర్‌లోనే ఇచ్చేందుకు వెళ్లాడు. బయటసెక్యూరిటీ గార్డుకు ఇవ్వాలని పురుషోత్తం సూచించాడు. బాధితుడు ఆ డబ్బులను సెక్యూరిటీగార్డు శ్రీనివాస్‌రెడ్డికి ఇస్తుండగా మఫ్టీలో ఉన్న ఏసీబీ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సెక్రెటరీతోపాటు, సెక్యూరిటీగార్డును అరెస్టు చేశారు. 60 వేల రూపాయలు సీజ్ చేసినట్లు, ఆదివారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు


ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ కార్యదర్శి పురుషోత్తం, సెక్యూరిటీ గార్డు శ్రీనివాస్‌రెడ్డి, స్వాధీనం చేసుకున్న నగదు


మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

● జగిత్యాలలో సోదాలు..

ఏఎంసీ సెక్రెటరీ పురుషోత్తం చాంబర్‌లో ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు జరిపారు. పండ్లవ్యాపారుల లైసెన్స్‌ల రెన్యూవల్ కోసం సమర్పించిన దరఖాస్తులు, ఇతర రికార్డులను సీజ్‌చేశారు. మరో వైపు ఏసీబీ మరో బృందం పురుషోత్తం స్వస్థలం జగిత్యాలలోని అతడి ఇంటిలో, మరో చోట సోదాలు జరిపారు. లక్షకుపైగా నగదు, ఇతర డాక్యుమెంట్లను సీజ్ చేశారు.

● లంచాల కోసం వేధింపులు..

కరీంనగర్ ఏఎంసీకార్యదర్శి ఎ.పురుషోత్తం ఐదేళ్లుగా లంచాల కోసం పండ్ల వ్యాపారులను వేధిస్తున్నాడని పండ్ల వ్యాపారులు నిమ్మకాలయపాషా, సుల్తాన్ అబిద్ ఆరోపించారు. తాము ఆరేళ్లుగా కరీంనగర్ ఏఎంసీలో హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. పండ్లు నిలువ చేసుకునేందుకు ఏఎంసీలో చిన్నచిన్న షెడ్‌లను అద్దెకు తీసుకుంటామన్నారు. షెడ్‌కు రూ.20వేల అద్దెను క్రమంతప్పకుండా ఏఎంసీకి చెల్లిస్తున్నా అదనంగా కార్యదర్శి పురుషోత్తం మరో రూ.20వేలు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. లంచంఇవ్వని వ్యాపారులను వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోయారు. పండ్లలోడ్‌తో వచ్చినవాహనాలను మార్కెట్‌యార్డులోకి అనుమతించక పోవడం, గేట్ మూసివేయడం వంటివి చేసేవాడని పేర్కొన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. షెడ్‌ల కోసం అదనంగా వసూలు చేసిన డబ్బులను రికవరీ చేయాలన్నారు.

ఎస్‌యూలోనే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీలోనే ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేయాలని హుస్నాబాద్‌కు తరలిస్తున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నాచేశారు. అనంతరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వఇంజనీరింగ్ కళాశాల కలగానే మిగిలిపోతోందన్నారు. ఉత్తరతెలంగాణలో కరీంనగర్ విద్యాకేంద్రంగా మారుతున్న తరుణంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులు ప్రైవేటుఇంజనీరింగ్ కళాశాల ల్లో ఫీజులు కట్టలేక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చినహామీలను నెరవేర్చడంలో విఫలమైంద న్నారు. కరీంనగర్ జిల్లాలో కళాశాలను ఏర్పాటుచేస్తామని స్వయంగా సీఎంరేవంత్‌రెడ్డి పెద్దపల్లిసభలో ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో పొన్నంప్రభాకర్ ఇల్లు ముట్టడిస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు గజ్జెల శ్రీకాంత్, మచ్చ రమేష్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కాంపల్లి అరవింద్, రామారాపు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, టౌన్ అధ్యక్ష కార్యదర్శులు రాము, హేమంత్, నాయకులు సురేష్, సాగర్, సందీప్, సందేశ్, రాకేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌యూ గేటు ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎంత కష్టం!

- కన్నతల్లిని రోడ్డు పక్కన వదిలి వెళ్లిన కొడుకులు
- సిరిసిల్లకు తరలించిన అంగన్‌వాడీ కార్యకర్తలు


వృద్ధురాలు

వేములవాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఏడు పదుల వయసులో ఆ వృద్ధురాలికి అనుకోని కష్టం వచ్చింది. కన్నకొడుకులు నడిరోడ్డుపైనే వదిలేయడంతో ఆ తల్లి దాదాపు 20 రోజులు నరకయాతన అనుభవించింది. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెను చేరదీసి సిరిసిల్లకు తరలించారు. వేములవాడ పట్టణంలో శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల సమీపంలోని పెద్దూరుకు చెందిన గంగవ్వ(70)కు ఇద్దరు కొడుకులు. ఏం జరిగిందో తెలియదు కానీ దాదాపు 20 రోజుల క్రితం గంగవ్వను కారులో తీసుకువచ్చి వేములవాడ పట్టణంలోని జాతరగ్రౌండ్ లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ఎదురుగా మెట్లపై వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. వృద్ధాప్యానికి అనారోగ్యం తోడు కావడంతో నడవలేని స్థితిలో ఉన్న ఆమెకు 20 రోజులుగా స్థానికులు కొంత ఆహారం అందిస్తూ వచ్చారు. విషయం తెలుసుకున్న వేములవాడ సీడీపీవో సౌందర్య శనివారం అంగన్‌వాడీ సిబ్బందితో వచ్చి వృద్ధురాలికి స్నానం చేయించి, బట్టలు మార్పించి సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మండల కేంద్రంలో కాలేజీ ఏర్పాటు చేయాలి

- ప్రతి రోజు 40కిలోమీటర్లు ప్రయాణిస్తున్న ఇంటర్ విద్యార్థులు
- తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా చదువులు


కాలేజీకి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు(ఫైల్)

గన్నేరువరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం నూతనంగా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు దాటినా నేటికీ మండలంలో ప్రభుత్వజూనియర్ కళాశాల ఏర్పాటుచేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని విద్యార్థులు ఇంటర్ చదువులకు కరీంనగర్‌కు ప్రతిరోజు 40కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. మండలకేంద్రంలో జూనియర్ కాలేజీ లేకపోవడంతో గత్యంతరం లేక ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ కాలేజీల బస్సుల్లో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీకి అనువైన స్థలం ఉండడంతో అందులో కాలేజీ ఏర్పాటుచేయాలని గతంలో నివేదికలు పంపినా సంబంధిత అధికారులు దానిపైన ఎలాంటి దృష్టిని పెట్టలేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు కరీంనగర్‌లోని ప్రైవేట్‌కాలేజీలకు పంపాల్సి వస్తుంది. తల్లిదండ్రులకు భారం పెరుగుతోంది. దూరాభారంతో పిల్లలకు చదువుపై ఏకాగ్రత లోపిస్తుందని లక్షలు ఖర్చుపెట్టి హాస్టల్‌లో ఉంచుతూ పిల్లల చదువు కోసం అప్పుల పాలవుతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్ర తినిధులు స్పందించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిద్రండులు, విద్యార్థులు కోరుతు న్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

జగిత్యాలరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేటకు చెందిన చింతకుంట్ల రాజనర్సయ్య(58) అనే రైతు వాగులో చేపలు పడుతుండగా విద్యు దాఘాతంతో మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాజనర్సయ్య తిప్పన్నపేట శివారులో విద్యుత్ వైరు అమర్చి వాగులో చేపలు పడుతున్నాడు. ఈక్రమంలో విద్యుత్ తీగ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. శనివారం బంధువులు రాజనర్సయ్య ఆచూకీ కోసం వెతుకుతుండగా వాగులో మృతదేహం కన్పించింది. పోలీసులు మృతదేహాన్ని వాగులో నుంచి బయటికి తీసి జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒకకూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యవసాయ కూలీ మృతి

సిరిసిల్ల రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంబస్వాపూర్‌కుచెందిన వ్యవసాయకూలీ బంటు ఆనందం (45) చెట్టుపైనుంచి పడి మృతిచెందాడు. శనివారం గ్రామంలోని చెట్టుపై చింతకాయలు తెంపేక్రమంలో ప్రమాదవ శాత్తు జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆనందంను చికిత్సకోసం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించిచికిత్స చేస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

ముస్తాబాద్ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ మానేరువాగు ఇసుకరీచ్ నుంచి ముస్తాబాద్ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇసుకను రవాణా చేయడం సరైనది కాదన్నారు. ముస్తాబాద్‌లో జరిగే అభివృద్ధి పనులకు ముస్తాబాద్‌కు చెందిన ట్రాక్టర్ యజమానులకు రవాణా బాధ్యతలు అప్పగించాలని కోరారు. వాగులో ఇసుక ట్రాక్టర్లు, యజమానులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు సంఘటన స్థలానికివెళ్లి వారిని శాంతింప చేశారు.

కుక్కను రక్షించబోయి బాలిక మృతి


శ్రీనిధి(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కను రక్షించబోయిన బాలిక చెరువులో పడి మృతిచెందిన ఘటన కొత్తపల్లి మండలం రేకుర్తిలో శనివారం జరిగింది. కొత్తపల్లి పోలీసుల వివరాలప్రకారం.. రేకుర్తికి చెందిన మైరాల శ్రీనిధి(11) శనివారం తన పెంపుడు కుక్కతోపాటు పెంటకమ్మ చెరువు వద్దకు వెళ్లింది. కొద్దిసేపు ఆడుకున్న తరువాత పెంపుడు కుక్క చెరువులోపడగా శ్రీనిధి గమనించి వెంటనే కుక్కను తాడుతో బయటకు లాగేక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయింది. గమనించిన ఇద్దరు యువకులు వెంటనే శ్రీనిధిని బయటకు తీసి ఆసుపత్రికి తర లించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు వెల్లడించారు. శ్రీనిధి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో ఈనెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య(45) గాయాల పాలై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బుర్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపారిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గంగయ్యను అదే గ్రామానికి చెందిన బిస్కు సత్యం తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న చిన్న గంగయ్య పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన బాధితుడి బావమరిది కర్రోళ్ల మల్లేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

నేటి నుంచి చైత్ర మాసం

● ఏప్రిల్ 9 నుంచి జూన్ 7 వరకు శుభ ముహూర్తాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరంలో చైత్రమాసం, వసంత ఋతువు ఆదివారంతో ప్రారంభం కానుంది. వసంత ఋతువు, చైత్ర మాసం సంవత్సర ప్రారంభాలుగా, బ్రహ్మదేవుడు ఉగాది నాడే సృష్టి రచన ప్రారంభించాడని చెబుతారు. చైత్ర మాసంలో విశేష రోజులున్నా శ్రీరామ నవమి తర్వాతే శుభకార్యాలు ఆచరించవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 9వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు వివాహాది శుభకార్యాలు నిర్వహించవచ్చు. మే 4 నుంచి 29వ తేదీ వరకు వాస్తు కర్తరితో గృహ ప్రవేశాలకు అవకాశం ఉండదు. జూన్‌లో గురు మూఢం కారణంగా జూన్ 10వ తేదీ నుంచి జూలై 9వ తేదీ వరకు ముహూర్తాలు లేవు. ఆగస్టు నెల శ్రావణమాసంలో ముహూర్తాలున్నాయి.

జాతీయస్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ



రైల్వేస్టేషన్‌లో నవీనను సత్కరిస్తున్న సీనియర్ క్రీడాకారులు

కోల్‌సిటీటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో జరిగిన ఖేలో ఇండియా అండ్ ఫెడరేషన్ కప్ జాతీయ స్థాయి ఉషూ పోటీల్లో ప్రతిభ కనపర్చిన ఓడ్డెపల్లి నవీనకు శనివారం రామగుండం రైల్వేస్టేషన్‌లో స్థానిక క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. రామగుండం రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి తగరపు శంకర్, 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్, సీనియర్ కరాటే మాస్టర్ శ్రీనివాస్‌లు నవీనను సన్మానించారు. ఉషూ క్రీడలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జాతీయస్థాయిలో పతకాలు సాధించడం ఇదే మొదటిసారి అని కొనియాడారు. తెలంగాణ స్పోర్ట్స్ ఫెడరేషన్ కప్ సీనియర్ విభాగంలో రెండు విభాగాల్లో ప్రతిభ కనపర్చి ద్వితీయ, తృతీయస్థానాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. రామగుండం మండల బీజేపీ అధ్యక్షుడు మిట్టపల్లి సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బల్వన్‌సింగ్, భావని, యూత్ అధ్యక్షుడు నల్లి నరేష్, కోచ్ సురేష్ పాల్గొన్నారు

చేతి వృత్తులకు వరం..

● ప్రధాని విశ్వకర్మ యోజనతో చేయూత
● పలు అంశాల్లో ఉచిత శిక్షణ





శిక్షణలో భాగంగా మహిళలు తయారు చేసిన గాజులు, బోకేలు, పూల దండలు

తిమ్మాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తుల వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనను ప్రవేశ పెట్టింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 17 సెప్టెంబరు 2023న ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. కేంద్ర ప్రభుత్వం 18 విభిన్న రంగాలకు చెందిన కళాకారులకు శిక్షణతో పాటు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో కార్పెంటర్, బోట్ మేకర్, ఆర్మర్, కమ్మరి, తాళాలు చేసేవారు, గోల్డ్ స్మిత్, కుండల తయారీదారులు, శిల్పి, తాపీ మేస్త్రీ, మత్యకార వలలు తయారు చేసేవాళ్లు, రాయి కొట్టేవారు, చెప్పులు కుట్టే వారు, బుట్ట, చాప, చీపుర్లు, గార్లండ్ మేకింగ్ (మలకార్), బొమ్మల తయారీ దారులు, టైలరింగ్, నాయి బ్రాహ్మణులు వంటి సాంప్రదాయ వృత్తుల వారు ఉన్నారు. ఎంపికైన వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి లబ్ధిదారులకు వ్యాపారం చేసేందుకు అర్హులైన వారికి తక్కువ వడ్డీకి రుణం అందిస్తారు.

● **ప్రయోజనాలు**

ఈ పథకం కొసం ధరఖాస్తు చేసుకున్న తరువాత నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎంపికైన ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు 500 రూపాయల స్టైఫండ్, శిక్షణ అనంతరం సర్టిఫికేట్, గుర్తింపు కార్డును ఇస్తారు. వ్యాపారానికి అవసరమయ్యే పరికరాల కిట్‌ను కాని, కిట్ కొనుగోలుకు అవసరమైనా ఆర్థిక సహాయం కాని అందజేస్తారు.

● **మహిళా ప్రాంగణంలో..**

తిమ్మాపూర్ మండలంఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో భాగంగా మహిళాలకు పలు చేతి వృత్తులకు సంబంధించి శిక్షణ ఇస్తున్నారు. దండలు అల్లడం, చీరల కొంగులు ముడివేయడం, బొకేస్ తయారు చేయడం, ఎన్వలప్, హోమ్ డెకరేటర్ వస్తువులు, ఇయర్ రింగులు, బ్యాంగిల్స్ డిజైన్, పేపర్ ఫ్లవర్స్ తయారీపై శిక్షణ నిస్తున్నారు. ఇప్పటికి నాలుగు బ్యాచులకు శిక్షణ పూర్తయింది. ఒక్కో బ్యాచ్ లో 10నుంచి17మంది మహిళాలకు శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ బాగుంది..

- ఎన్‌లత, వేములవాడ



కార్యదర్శులు చేబితే అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ బాగుంది. పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

ఉపాధి అవకాశాలు ఉంటాయి

- రాజ వర్ధిణి, ట్రైనర్



ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో చేరి శిక్షణ పొందుతున్న మహిళాలకు ఉపాధి అవకాశాలు బాగుంటాయి. ఇంట్లో ఉండి కూడా జీవనోపాధి పొందొచ్చు. బ్యాంగిల్స్ డిజైన్, ఇయర్ రింగ్స్ పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ.

సుధారాణి, ప్రాంగణం జిల్లా మేనేజర్



ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చాం. ఒక్కో బ్యాచ్‌లో 10 నుంచి 17 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. నిరుపేదలకు ఈ పథకం వరం లాంటింది. ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్ ఇస్తున్నాం. శిక్షణ అనంతరం ఉపాధి పొందేందుకు సహకారం అందజేస్తాం.

● **అర్హతలు :**

ఈ పథకానికి 18 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు, అసంఘటిత రంగంలో పని చేసే కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాపారాల్లో నైపుణ్యం కలిగి, చేతి వృత్తులు సాగించే వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకొడానికి అర్హులు.

● **ఇలా దరఖాస్తుల చేసుకోవాలి**

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనలో చేరే వారు ముందుగా సంబందిత ప్రభుత్వ వెబ్ సైట్(**pmvishwakarma.gov.in**)లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేయడానికి ఆధా ర్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు గానీ, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పనిసరి. ఆదాయ ధ్రువీకరణ పత్రం, చిరునామాను నిర్ధారించే పత్రం, పథకానికి సంబంధించి ఆర్థిక లావాదేవీలు నిర్వహణకు బ్యాంకు ఖాతా వివరాలతో ధరఖాస్తు చేసుకొవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం పూర్తి అయిన తరువాత వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత అర్హులైనా వారిని ఉచిత శిక్షణకు పిలుస్తారు.

ధర్మపురిలో పెరిగిన భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజ లు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి పోయారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు పూజలు నిర్వహించారు.

అంతర్రాష్ట్ర సైబర్ మోసగాడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని ఆశ చూపి రూ.40.9 లక్షలు స్వాహా చేసిన అంతర్రాష్ట సైబర్ మోసగాడిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో సైబర్ క్రైం డీఎస్పీ నరసింహారెడ్డి కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి 2024 జూలైలో ఇన్‌స్టాగ్రాంలో ఆన్‌లైన్‌లో పెట్టుబడికి సంబంధించిన ప్రకటన వచ్చింది. దానికి స్పందించిన బాధితుడు మొదట వెయ్యి రూపాయలు పెట్టుబడి పెట్టగా రెండు వేల రూపాయల లాభం వచ్చింది. దీంతో బాధితుడు ఏడు విడతలో రూ.40.9 లక్షలు సదరు సంస్థలో పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడి కింద పెట్టిన డబ్బులకు లాభం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించేది. ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసుకునేందుకు అవకాశం ఉండకపోయేది. దీంతో మోసానికి గురైనట్లు తెలుసుకున్న బాధితుడు 2024 ఆగస్టులో సైబర్ క్రైం హెల్ప్‌లైన్ సెంటర్ 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుపై కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి విచారణ ప్రారంభించారు. గుజరాత్‌కు సంబంధించిన బ్యాంక్ ఖాతాలో బాధితుడి డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. ఈ మేరకు సైబర్ క్రైం పోలీసు టీం సభ్యులు ఈ నెల 27న గుజరాత్‌లోని సూరత్‌కు వెళ్లారు. అక్కడ సైబర్ మోసగాడైన నితిన్‌దేవచంద్ భాయ్ గజేరాని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సూరత్ కోర్టులో నిందితుడిని హాజరు పరిచారు. అక్కడి కోర్టు అనుమతితో ట్రాన్సిస్ట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చి శనివారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నిందితుడు నితిన్ దేవచంద్ భాయ్ గజేరానిని జైలులో రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ఇన్‌వెస్ట్‌మెంట్‌కు సబంధించి సామాజికమాద్యమాల ద్వారా ఆకర్షణీయ ప్రకటనలు పంపిస్తాడని, స్పందించిన వారికి రెట్టింపు లాభాలు ఆశచూపి ఆర్‌బీ ఎల్ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ చేయమంటాడని సైబర్ క్రైం డీఎస్పీ తెలిపారు. ఆ అకౌంట్‌పై 19 వరకు కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. తెలంగాణలోని రెండు జిల్లాలతోపాటు, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళలో నితిన్‌దేవచంద్ భాయ్ గజేరానిపై కేసులు నమోదైనట్లు తెలిపారు.

అనుమానం పెనుభూతమై..

● భార్యపై రోకలిబండతో దాడి.. ఆపై ఆత్మహత్య



దుర్గయ్య(ఫైల్)



రాజవ్వ(ఫైల్)

మల్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను రోకలిబండతో తలపై కొట్టడంతో తీవ్రగాయాలు కాగా భయాందోళనకు గురైన భర్త సదువుల దుర్గయ్య(58) ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపల్లిలో జరిగింది. తీవ్రగాయాలతో భార్య రాజవ్వ(48) శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. లంబాడిపల్లికి చెందిన సదువుల దుర్గయ్య బేడ బుడిగ జంగాల కులవృత్తిలో భాగంగా వివిధ ప్రాంతాలకు వెళ్లి భిక్షాటన చేస్తూ మూడు నెలలకోసారి స్వగ్రామానికి వస్తుంటాడు. కొన్నాళ్లుగా భార్యపై అనుమానంతో మద్యానికి బానిసైన దుర్గయ్య రాజవ్వను వేధిస్తున్నాడు. దీంతో కుల పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీ నిర్వహించి దుర్గయ్యను మందలించారు. అయినప్పటికీ పద్ధతి మార్చుకోక పోగా శుక్రవారం బీడీలు చేస్తున్న రాజవ్వను రోకలిబండతో తలపై దాడి చేశాడు. దీంతో తలకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు రాజవ్వను వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. కాగా భార్య తలకు తీవ్ర గాయాలు కావడంతో భయపడిన దుర్గయ్య గ్రామంలోని బీరయ్యగుడి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

దుర్గయ్య కోసం బంధువులు శుక్రవారం రాత్రి వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం దుర్గయ్య గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. కాగా చికిత్స పొందుతూ రాజవ్వ శనివారం కరీంనగర్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. మృతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి సిరిగిరి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నీలం రవి తెలిపారు.

ఉగాది కవి సమ్మేళనానికి మానేరు కవులు

సిరిసిల్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతియేటా నిర్వహించే కవి సమ్మేళనానికి సిరిసిల్ల నుంచి ధాశరథి అవార్డు గ్రహీత ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, మానేరు రచయితల సంఘం కవులు పత్తిపాక మోహన్, అడెపు లక్ష్మణ్, ఈడెపు సౌమ్యలకు తెలంగాణ సాంస్కృతిక శాఖ అహ్వానం పంపింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉగాది సందర్భంగా నిర్వహించే కవి సమ్మేళనంలో వీరు కవితాగానం చేయనున్నారు.

కవి సమ్మేళనానికి వెళ్తున్న కవులను మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టివి నారాయణ, కార్యనిర్వా హక అధ్యక్షుడు ఎలగొండ రవి, మడూరి అనిత, శ్రీమతి, అంకారపు, దూడం గణేష్ తదితరులు అభినందించారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

● వేములవాడ ఆలయంలో ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రాజన్న ఆలయంలో ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరామనవమికి ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30 గంటల తర్వాత భక్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించుకునే వెసులుబాటు కల్పించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయ మే స్వస్తి పుణ్యాహవచనం, స్వామివారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహిస్తారు. ఉదయం 10.40 గంటలకు పంచాంగ పూజ, సాయంత్రం 4 గంటలకు పంచాంగ శ్రవణం, పండిత సన్మానం నిర్వహించనున్నారు.

● **6న సీతారాముల కల్యాణం**

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో ఏప్రిల్ 6వ తేదీన సీతారాముల దివ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేం దుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని తీరొక్క పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఏప్రిల్ 6న ఉదయం 11.55 గంటలకు సీతారామచంద్ర స్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం రాత్రి డోలోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణం రోజు కోడె మొక్కులు మినహా అభిషేకాలు, అన్నపూజలు, నిత్యకల్యాణాలు, కుంకుమ పూజలు, లింగార్చనలు, శ్రీసత్య నారాయణ వ్రతాలతో పాటు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నారు.



రాజన్న ఆలయంలో కల్యాణానికి ఏర్పాట్లు

భారీగా తరలిరానున్న భక్తులు

రాజన్న ఆలయంలో నిర్వహించే సీతారా మచంద్ర స్వామి వారి దివ్య కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. సుమారు 50 వేలకు పైగా భక్తులు రానున్నట్లు ఆల యాధికారులు అంచనా వేస్తున్నారు. భక్త లకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులతో ఆర్డీవో, ఆలయ ఈవో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుం డా టౌన్ సీఐ వీరప్రసాద్ నేతృత్వంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రాములోరి కల్యాణ వాల్‌పోస్టర్‌ను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భం గా రాజన్న ఆలయ ఆవరణతో పాటుగా పట్ట ణంలో ఏఈవో అశోక్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ లను అతికించారు.

పథకం ప్రకారమే యువకుడి హత్య

● ప్రోత్సహించిన భార్య, బావమరిది
● పరువుహత్య కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్

ఎలిగేడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కూతురిని ప్రేమించాడనే కారణంతో పరువు హత్యకు పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి కథనం ప్రకారం ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థురాలు అయిన ఒక అమ్మాయిని సాయికుమార్‌గౌడ్ రెండు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నాడు. ఇద్దరు ఒకరి నొకరు ప్రేమించుకుని పెళ్లి చేసుకుందామని అనుకున్నారు. ఈ విషయం తెలిసిన అమ్మాయి తండ్రి ముత్యం సదయ్య పలుమార్లు సాయికుమార్‌ని, కూతురిని మందలించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో అతడిని చంపితేనే తన కూతురిలో మార్పు వస్తుందని అమ్మాయి తల్లి సమత సదయ్యతో చెప్పింది. అలాగే రంగాపూర్‌కు చెందిన సమత సోదరుడు కూడా అతన్ని చంపితేనే బాగుంటుందని, ఏమైనా సహాయం అవసరం ఉంటే తర్వాత చేస్తానని చెప్పాడు. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీన పూరెల్ల సాయికుమార్‌గౌడ్ జన్మదినం ఉన్నందున కూతురు చదువుతున్న పెద్దపల్లిలోని కాలేజీ వద్దకు వస్తాడని గ్రహించిన సదయ్య, అతని బావమరిది సారయ్యతో కలిసి కాలేజీ వద్ద వాకబు చేశారు. అక్కడ ఆమె లేదని తెలుసుకొని వేచిచూశారు. కూతురిని సాయికుమార్ ద్విచక్ర వాహనంపై కాలేజీ వద్ద దింపి ముప్పిరితోటకు వెళ్లాడు. అనంతరం రాత్రి 9.40గంటలకు సాయికుమార్ మిత్రులతో కలిసి వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మద్యం సేవిస్తుండగా సదయ్య వాహనంపై వెళ్లి సాయికుమార్‌పై గొడ్డలితో విచక్షణ రహితంగా నరికి చంపాడు. అక్కడికి నడుచుకుంటూ వెళ్లిన సదయ్య భార్య సమత సంఘటనను చూసి వెళ్లిపోయింది. సంఘటన జరిగిన వెంటనే నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. శనివారం ఉదయం 11గంటలకు నిందితులు సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రాత్రి 10గంటలకు సుల్తానాబాద్ న్యాయాధికారి ఎదుట హాజరు పరిచారు.

3న మున్సిపల్ తైబజార్ వేలం

పెద్దపల్లిటౌన్,మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరానికిగాను ఏప్రిల్ 3న మున్సిపల్ తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే 2 తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు మున్సిపల్‌కు పన్ను బకాయి ఉండరాదన్నారు. నగదు రూపేణా రూ.50 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలం దక్కించుకున్నవారు 72 గంటల లోపు 50 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగితా సెప్టెంబరు నెలలో చెల్లించి అగ్రిమెంటు చేసుకోవాలని వివరించారు.

తైబజార్ వేలం వాయిదా

సుల్తానాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ తైబజార్ వేలం వాయిదా వేసినట్లు కమిషనర్ మహ్మద్ నియాజ్ తెలిపారు. పది లక్షల రూపాయలు నిర్ణయించగా ఈ నెల 27న నిర్వహించిన వేలంలో మూడు లక్షల ఇరవై ఐదు వేల వరకు మాత్రమే పాడారన్నారు. శనివారం కూడా ఆశించిన మేరకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

అధికారులు జవాబుదారితనంతో పనిచేయాలి

కమాన్‌పూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అధికారులు జవాబుదారితనంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి రూ.50లక్షల డిఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన తహసీల్దార్ భవన నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో కార్యాలయాలను నిర్మిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను చట్టప్రకారం పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థ వల్ల జరిగిన నష్టాలను భూభారతి చట్టంతో చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామన్నారు. చట్టానికి లోబడి మాత్రమే అధికారులు పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. మండల కేంద్రాలలో కూడా కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండేవిధంగా అనువైన స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్‌కు సూచించారు. షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయం నిర్మిస్తామని, అందుకు స్థలాన్ని ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం కల్పించిన మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్



కమాన్‌పూర్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సరఫరా చేస్తున్నామన్నారు. రైతులకు 2లక్షల రుణ మాఫీ, రూ.500 బోనస్ అందించామని మంత్రి తెలిపారు. ఉగాది నుంచి రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం సరఫరా చేస్తామన్నారు. రైతులకు ఒకగింజ కూడా తాలు కట్ చేయకుండా మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మండలంతోపాటు రామగిరి, ముత్తారం మండలాల్లో తహసీల్దార్ కార్యాలయ భవనాలను నిర్మిస్తున్నామని, మంథనిలో డివిజన్‌కు సంబంధించిన అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేవిధంగా సమీకృత కార్యాలయాల సముదాయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కే.చక్రవర్తి, ఈఈ గిరీష్‌బాబు, డిఈ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు ఇప్పించండి

ఇళ్లస్థలాలు ఇప్పించాలని మంత్రి శ్రీధర్‌బాబుకు, కలెక్టర్ కోయ శ్రీహర్షకు మండల పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. గతంలో గుండారం వద్ద స్థలాలు ఇచ్చారని, సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆ భూమి తీసుకొందని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్థలంతోపాటు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సాయిశంకర్, సీనియర్ పాత్రికేయుడు జబ్బార్‌ఖాన్, గాదె బాలు, దండె కృష్ణ, ఆరేపల్లి శంకర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ మాజీ అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్ శనివారం రాష్ట్ర ఐటీశాఖమంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబును కమాన్‌పూర్ మండలంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జూలపల్లి మండల సమస్యలపై మంత్రికి వివరించారు. పలువురు మండల నాయకులు ఉన్నారు.

పిల్లలు ఎందరున్నా పోటీకి అర్హులే?

(5వ పేజీ తరువాయి)

నుంచి చాలా మంది రాజకీయాల్లో ఉన్న వాళ్లు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వాళ్లు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకోవడం ఆరంభించారు. అయినా కొందరు ఇద్దరికి పైగానే సంతానం ఉన్నారు.

● మున్సిపల్ ఎన్నికల్లో సడలింపు..

2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వాళ్లు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అని నిబంధనను సడలించింది. దీంతో 25 ఏళ్లుగా మున్సిపల్ ఎన్నికలకు దూరంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల్లో పోటీ చేశారు. మున్సిపల్ ఎన్నికల కంటే ముందే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. త్వరలో జరగనున్న ఈ ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన సడలిస్తారని అన్ని రాజకీయ పక్షాలు భావిస్తున్నాయి. లోక్‌సభ స్థానాల డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తుండడంతోపాటు జనాభాను పెంచుకోవాలనే భావనకు ఆయా ప్రభుత్వాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ప్రభుత్వం సడలించే అవకాశాలున్నాయని అధికార పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

కాలువలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత

సుల్తానాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని, ఎస్సారెస్పీ కాలువలను ధ్వంసం చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే విజయరమణారావు హెచ్చరించారు. సుల్తానాబాద్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతు కాలువల చివరి భూములకు నీరందకుండా మొదట్లోనే కొందరు రైతులు నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని, ఈ విషయంలో ఎవరినీ వదిలేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మిస్తే కొందరు కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడపడంతో దెబ్బతింటున్నాయని, వీరిని కూడా ఉపేక్షించేది లేదని, మొదటి సారి రెండు వేలు, రెండో సారి ఐదు వేలు జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటామని మూడోసారి అలాగే వస్తే వాహనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సీజ్ చేస్తామన్నారు. రోడ్లను కాపాడుకోవడానికి త్వరలోనే పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

● కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోళ్లు

ఎలాంటి కటింగ్‌లు లేకుండా నియోజకవర్గంలో మాత్రమే ధాన్యం కొనుగోళ్ళు జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. సన్న వడ్లు పండించినా వారం దరికీ క్వింటాల్‌కు ఐదు వందలు చొప్పున బోనస్ ఇప్పిస్తామన్నారు. ఎనభై శాతం మందికి రుణమాఫీ జరిగినా బీఆర్ఎస్, బీజేపీలు తమ పై బురద జల్లడం, ప్రజలను మభ్యపెట్టడం మానడం లేదని, ఎక్కడ చర్చ కైనా తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, కేడీసీసీబి డైరక్టర్, సహకార సంఘం చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల మాట్లాడారు. సంఘం సీఈఓ బూరుగు సంతోష్ మాట్లాడుతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధిని ఆదాయ వ్యయాలను వివరించారు. సంఘ డైరక్టర్లు పన్నాల రాములు తదితరులు పాల్గొన్నారు.

5న చలో హైదరాబాద్

కళ్యాణ్‌నగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లో ఆపరేషన్ కంగార్‌ను నిలిపివేయాలంటూ ఏప్రిల్ 8న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి నరేష్ పిలుపునిచ్చారు. శనివారం గాంధీనగర్‌లోని పైలాన్ చౌరస్తా వద్ద ప్రజా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆపరేషన్ కంగార్ పేరిట ఆదివాసిని అంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని, ఛత్తీస్‌గడ్‌లో వందలాది మందిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని, దేశ సంపదను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నాయని, 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజేశం, మల్లేషం, బాబు, ప్రసాద్, మొండయ్య, ప్రేమ్ కుమార్, అఫ్జల్, సంతోష్, వెంకటేష్, చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పెద్దపల్లిలో వేడుకలను నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే సంక్షేమ పథకాలకు నాంది పలికిందని టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు అక్కపాక తిరుపతి అన్నారు. శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి, పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తిరుపతి మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ బడుగుల సంక్షేమానికి వినూత్న పథకాలెన్నో తెచ్చారని కొనియాడారు. సీనియర్ నాయకుడు కోల కిషన్ రావు, కొప్పుల మురళి, ముదుకర్, చంద్రయ్య, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి జెండాను ఎగురవేసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు బలహీన వర్గాల కోసం పార్టీని స్థాపించి 9నెలలలోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిందన్నారు. దామోదరరెడ్డి, నల్లరవీందర్, ఓదెలు, చిటికెల రాజలింగు, స్వరాజ్యం, మాటేటిలక్ష్మీ, కళావతి, పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలను పార్టీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ బాధ్యుడు అందె భాస్కరాచారి ఆధ్వర్యంలో జరిగాయి. ఎన్టీఆర్ విగ్రహానికి పూల వేసి నివాళులర్పించి జెండాను ఎగురవేశారు. మహేష్, కంటిపూడి రామకృష్ణ, రాజ్‌మహ్మద్, నారాయణ, మల్లారెడ్డి, సుశీల, ముక్తీశ్వర్, మహేష్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, ప్రజల బాగోగులు కోరుకునేది బీఆర్ఎస్ పార్టీనేనని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మండలంలో ఏర్పాటైన ఆర్‌అండ్ఆర్ కాలనీ రచ్చపల్లికి గ్రామ పంచాయతీ గెజిట్ నోటిఫికేషన్ రావడంపై మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మిర్యాల ప్రసాద్‌రావు, మాజీ ఉప సర్పంచ్ సదానందం ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం పుట్ట మధును సన్మానించారు. బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పుట్ట మధు మాట్లాడుతూ.. తాను కృషి చేసిన రచ్చపల్లి గెజిట్‌ను 9 నెలలుగా బయటకు రాకుండా అడ్డుకున్నారన్నారు. గవర్నర్ వద్దకు వెళ్లి గెజిట్‌ను బయటకు తీయించామన్నారు. సింగరేణి చరిత్రలో కొత్త ప్యాకేజీలు రచ్చపల్లి నిర్వాసితులకు ఇప్పించామన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో సింగిరెడ్డిపల్లి, పెద్దంపేట, మంగళిపల్లి గ్రామాల ప్రజలు పునరావాసానికి నోచుకోలేక పోయారన్నారు. తమ హయాంలో రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ నిర్వాసితులకు ఆర్‌అండ్ఆర్ కాలనీలు ఏర్పాటు చేయించామన్నారు. బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, కుమార్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండలంలోని పెంచికల్‌పేట గ్రామానికి చెందిన కుంబం లచ్చమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. వృద్ధురాలికి పుట్టు మధు అంటే అభిమానమని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పుట్ట మధు లచ్చమ్మ పార్థివదేహానికి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొని పాడెమోశారు.

కులదూషణలు ఉంటే చర్యలు తప్పవు

పెద్దపల్లి రూరల్ , మార్చి29 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో దళితులపై కులదూషణ ఉన్నట్లయితే ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుటామని డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ అన్నారు. కొత్తపల్లిలో శనివారం కుల వివక్షతపై పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. కార్యదర్శి సురేందర్, దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎలిగేడు : ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ జయలక్ష్మీ అన్నారు. శనివారం ధూళికట్టలో సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఫలాలను అందిపుచ్చుకోవాలన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. కార్యదర్శి ఆరెపల్లి పున్నమయ్య, సిఆర్‌పి లక్ష్మి నారాయణ, అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వెన్నంపల్లి ఎస్సీ కాలనీలో శనివారం సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్ మాట్లాడుతూ కాలనీలో ఏమైన సమస్యలు ఉంటే తెలియచేయాలన్నారు. రెవెన్యూ పరంగా భూముల సమస్యల ఉంటే మధ్య దళారులను ఆశ్రయించకుండా నేరుగా రెవెన్యూ కార్యాలయానికి రావాలని వారికి సూచించారు. ఆర్ఐ రాజేందర్, కార్యదర్శి శ్రవన్, సిబ్బంది జాహేద్ పాషా గ్రామస్థులు పాల్గొన్నారు.

పాలకుర్తి: పౌరహక్కులకు భంగం కలిగించొద్దని పాలకుర్తి రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ మల్కారెడ్డి అన్నారు. శనివారం మండలం పరిధిలోని జయ్యారంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యదర్శి పెండ్లి సాయిచరణ్‌రెడ్డి, కారోబార్ బద్దపురి శంకర్ పాల్గొన్నారు.

సర్వమతాల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సర్వ మతాల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాట్లాడారు. తన గెలుపులో మైనార్టీలు అండగా ఉన్నారన్నారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి అర్హులైన మైనార్టీలకు ప్రభుత్వం తరుపున రుణాలు అందిస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మెన్ రూప్లా నాయక్, ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

మంథని, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తీసుకోవాలని పల్లె దావాఖాన డాక్టర్ శంకరమ్మ శనివారం అవగాహన కల్పించారు. రెండు నెలల పాటు ప్రజలు మధ్యాహ్నం 12 గంటలోపు తమ పనులు పూర్తి చేసుకోవాలన్నారు.

శ్రీసీతారామా సేవా సదన్ అధ్యక్షుడిగా హరిబాబు

మంథని, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసీతారామా సేవా సదన్ అధ్యక్షుడిగా కేవీఎల్ఎన్ హరిబాబు నియమితులయ్యారు. శనివారం సదన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా దుద్దిళ్ల గణపతి, కోశాధికారిగా అంబరీష్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ప్రహ్లాద్, కార్యవర్గ సభ్యులుగా సువర్ణ మహాదేవ్, ప్రదీప్‌లు ఎన్నికయ్యారు.

క్షేమంగా చేరుకున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కుటుంబం

గోదావరిఖని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్ భూపంకం నుంచి బయటపడ్డ రామగుండం ఎమ్మెల్యేమక్కాన్‌సింగ్ కుటుంబ సభ్యులు శనివారం క్షేమంగా హైదరాబాద్ చేరుకున్నారు. తెల్లవారుజాము హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాజ్‌ఠాకూర్ భార్య మనాలీ ఠాకూర్, కొడుకు ప్రతీక్, కోడలు హిత, మరో కుమారుడు నిరీష్‌లు చేరుకున్నారు. వారిని చూడగానే రాజ్‌ఠాకూర్ ఉద్వేగానికి లోనయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, వివిధ పార్టీల ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్‌కు ఫోన్ చేసి కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. శనివారం రాత్రి రాజ్‌ఠాకూర్ కుటుంబ సభ్యులు గోదావరిఖనికి చేరుకున్నారు.

మాకు పునర్జన్మ : మనాలీ ఠాకూర్

బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చేందుకు సిద్ధమవుతుండగానే భూకంపం వచ్చింది. నాకు కళ్లు తిరిగినట్లు అయ్యింది. 35 అంతస్థుల హోటల్‌లో మేము 30వ అంతస్థులో ఉన్నాం. రన్ ఫర్ యువర్ లైఫ్ అంటూ బయట అరుపులు వినబడ్డాయి. నేను, కోడలు, ఇద్దరు పిల్లలం అన్నీ వదిలి బయటకు పరుగులు పెట్టాం. 30అంతస్థులు మెట్లపై నుంచి పరుగెత్తుకుంటూ దిగుకుంటూ వచ్చాం. మెట్లు దిగుతుండగా భూకంపం వస్తూనే ఉంది. గోడలు పగిలి పెచ్చులూడుతున్నాయి. కిందకు వచ్చినాక పాస్‌పోర్టులు హోటల్ గదిలోనే మరిచిపోవడంతో సిబ్బంది ప్రాణాల తెగించి తీసుకువచ్చి ఇచ్చారు. కారులో ఎయిర్‌పోర్టుకు వెళుతుండగా దారిలో పెద్ద పెద్ద భవనాలు కూలుతుండడం గమనించాం. ప్రజల ప్రేమ, ఆధారాభిమానాలతోనే బయటపడ్డాం.

విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది సంబరాలు

కోల్‌సిటీటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి విద్యాసంస్థలో ముందస్తు విశ్వవాసు నామ సంవత్సరం ఉగాది సంబరాలు శనివారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అందరికి మంచి జరగాలన్నారు. ఉపాధ్యాయులు ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో ఉగాది వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ మరియాగొరేటి, ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి, టేకిల, మేరి, సలీనా, ఫాధర్ రాయప్పరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓఝూ మాట్లాడారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్వవసునామ ఉగాదిని పురస్కరించుకొని ఉత్సవాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులందరికీ ఉగాది పచ్చడి, బొబ్బట్లు అందజేసి పండుగ విశిష్టత వివరించారు. ప్రధానోపాధ్యాయులు అకినపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు పండుగ సాంప్రదాయాలను పాటించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎన్.రమాదేవి, ఎన్.ఆగయ్య, కే.సత్యప్రకాష్‌రావు, రాజమౌళి పాల్గొన్నారు.



పెద్దపల్లి ట్రినిటీలో కళాశాలలో, యూనివర్సల్ పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): విశ్వవసు నామ సంవత్సర ప్రారంభ సమయంలో ముందస్తుగా ట్రినిటీ డిఎడ్ కళాశాలలో ఉగాది సంబరాలను నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, ట్రినిటీ డైరెక్టర్ దాసరి మమతారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఉగాది పచ్చడి సేవించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ట్రినిటీ బీఈడీ, డీఎడ్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు ఐ.రజని, రెడ్డమ్మహరి, బుర్ర తిరుపతి పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): జీడీనగర్‌లోని యూనివర్సల్ పాఠశాల, ఈసాలతక్కళ్లపల్లిలోని జేమ్స్ మోడల్ ఇంగ్లీష్ మీడియం, పుట్నూర్‌లోని గ్లోబల్ పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంపిణీ చేశారు. కరస్పాండెంట్లు ఇస్మాయిల్, జాలపెల్లి మహేష్, సత్యంగౌడ్, ప్రధానోపాధ్యాయులు అఫ్జల్, స్వప్న, సతీష్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): శ్రీవాణి విద్యా సంస్థల్లో ముందస్తు ఉగాది సంబరాలు జరుపుకున్నారు. పంచాగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు మాట్లాడుతు ఉగాది పండుగ విశిష్టత గురించి వివరించారు. డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, సాదిక్‌పాషా అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖనిలో ట్రాన్స్‌జెండర్ల నిరసన

కోల్‌సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు హిజ్రాలను హేళన చేయడాన్ని నిరసిస్తూ శనివారం గోదావరిఖని చౌరస్తాలో హిజ్రాలు నిరసన ప్రదర్శన చేశారు. అసెంబ్లీలో ఈ నెల 26న ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ట్రాన్స్‌జెండర్ల కోసం చేపడుతున్న పథకాలపై మాట్లాడుతుండగా మాజీ మంత్రులు హరీష్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి అవమానకరంగా ప్రవర్తించారని, దీనిని ట్రాన్స్‌జెండర్ల కమ్యూనిటీ ఖండిస్తుందన్నారు. మాజీ మంత్రులు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకపోతే వారి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ట్రాన్స్‌జెండర్ల కోసం పథకాలు చేపట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ట్రాన్స్‌జెండర్ల అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కామేశ్వరి, నిషా, పింకి, రజిని, నర్సమ్మ, వెన్నెల, కావ్య, దుర్గ, నిలీమ పాల్గొన్నారు.

బ్రాస్‌బ్యాండ్ యూనియన్ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

సుల్తానాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ రెండవ జిల్లా మహాసభలు సుల్తానాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ సాహెబ్ హుసేన్, బూరుగు శ్రీకాంత్ తెలిపారు. పోస్టర్‌ను శనివారం సుల్తానాబాద్‌లో ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు గుణపతి, శ్రీకాంత్, గోపాల్, అజ్జు, లింగయ్య జహంగీర్ పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

మంథని, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయంలో ఉగాది పండగ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గట్టు రాము తెలిపారు. 6న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓసీపీ-2ను సందర్శించిన డైరెక్టర్(ఆపరేషన్స్)

రామగిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2ను శనివారం సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి సూర్యనారయణ సందర్శించారు. ఉత్పత్తి, రవాణా, యంత్రాల వినియోగంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించుటకు తీసుకుంటున్న భద్రతా చర్యలను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు వివరించారు. రఘుపతి, చంద్రశేఖర్, ఐలయ్య, షబ్బీరుద్దీన్, కోల్‌శ్రీనివాస్, రవీందర్, శ్యామల పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ కన్వీనర్‌గా హరీష్



కళ్యాణ్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆర్‌జీ-1 కన్వీనర్‌గా ఆరెపల్లి హరీష్‌ను నియమిస్తూ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కులను కాపాడటానికి పని చేస్తానని, ఉద్యోగులు సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తన నియామకానికి కృషి చేసిన రాజేశ్వర్‌రావు, ఏరియా లైజనింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

రికార్డ్ స్థాయిలో బొగ్గు రవాణా

గోదావరిఖని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా జీడీకే వన్ సీఎస్‌పీ శుక్రవారం 6రేక్‌ల ద్వారా సుమారు 24,068 టన్నుల బొగ్గు రవాణా చేశారు. మార్చి నెల రవాణా లక్ష్యం 4,74,300 టన్నులకు గాను శుక్రవారానికి 4,81,850 టన్నుల రవాణా చేసినందుకు ఆర్‌జీ-1 జీఎం డీ లలిత్ కుమార్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు, కార్మికులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మును ముందు జీడీకే వన్ సీఎస్‌పీకి నిర్దేశించిన బొగ్గు రవాణా సాధించాలని తెలిపారు.

మెడికల్ కార్డుల దరఖాస్తుకు గడువు పెంపు

గోదావరిఖని, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు వైద్య సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్డ్‌మెంట్ మెడికేర్ స్కీం (సీపీఆర్ఎంఎస్) కింద సభ్యత్వానికి దరఖాస్తు గడువు ఏప్రిల్ 15 వరకు పొడిగించినట్టు ఆర్‌జీ-1 డీజీఎం(పర్సనల్) డీ కిరణ్ బాబు తెలిపారు. సంబంధిత గని లేదా విభాగంలో సంప్రదించి దరఖాస్తు అందజేయాలని కోరారు. ఈ స్కీం క్రింద సభ్యత్వానికి రూ.60వేలు చెల్లించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయి

జూలపల్లి, మార్చి 29. (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఇచ్చే ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలో శనివారం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్థానిక మజీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, లోక రవిందర్‌రెడ్డి, నన్నేసాబ్, లాల్‌మహమ్మద్, ఎండి గౌస్‌పాషా, ఎండి అంకూస్, అబ్బులు, షాబొద్దీన్, వకీర్, హుస్సేన్, పజలుల్లా పలువురు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఎంబి గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇఫ్తార్ విందుకు ముస్లింలు హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

ప్రభుత్వ పథకాలపై ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్వే

కోల్‌సిటీటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న, చేసిన పథకాలపై గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, 3 ఆధ్వర్యంలో శనివారం వాలంటీర్లు సర్వే చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా విఠల్‌నగర్‌లో సుమారు 50 కుటుంబాలను సర్వే చేశారు. ప్రభుత్వ పథకాలను వివరించడంతోపాటు ఏవిధంగా ఉపయోగించుకుంటున్నారు, పథకాలు అందుతున్నాయో లేదో అనే అంశాలపై వాలంటీర్లు తెలుసుకున్నారు. సర్వే చేయడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జైకిషన్ ఓఝూ అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ నరేష్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సురేష్, డాక్టర్ అజయ్, సారయ్య, అరుణ, నాగమణి, వాలంటీర్లు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందజేత

ధర్మారం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అందజేశారు. శనివారం విద్యావనరుల కేంద్రంలో అలీం-కో, సమగ్ర శిక్షా సహకారంతో ఉపకరణాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. నాయకంపల్లికి చెందిన కృషగ్నకు హియరింగ్, మైనేని స్వాతీలకు క్యాలిపర్స్ పెర్కపల్లికి చెందిన పిట్టల కీర్తన, రామయ్యపల్లికి చెందిన మార్క రక్షితకు బ్రెయిలీ కిట్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు బి.దుర్గ ప్రసాద్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత

జూలపల్లి, మార్చి 29. (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, వీనావాణి దంపతుల కుమార్తె స్వర్గీయా యశోదరెడ్డి స్మారకార్థం శనివారం జిల్లా కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. స్ఫూర్తి మానసిక దివ్యాంగుల కేంద్రం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

పెద్దపల్లి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని ఎంపీవో ఫయాజ్ అన్నారు. శనివారం రాఘవపూర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి తూముల రవి, బిల్ కలెక్టర్ బుచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మల్లన్న ఆలయంలో ఉగాది వేడుకలు

ఓదెల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంభ మలికార్జునస్వామి క్షేత్రంలో ఆదివారం విశ్వావసు నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షణ, పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. స్వామివారికి ఏకదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు, పారాయణాలు , వాహన పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో సదయ్య తెలిపారు. ఉగాది నుండి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ, జూలైలో పెద్దపట్నం, అగ్నిగుండం మహోత్సవాలతో జాతర ముగుస్తుంది.

దరఖాస్తుల స్వీకరణ

ఓదెల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): యువకుల నుంచి రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధి కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో తిరుపతి తెలిపారు. దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఏప్రిల్ 5 వరకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, లేదా ఆదాయం సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, సదరం సర్టిఫికెట్, నాలుగు పాస్ ఫోటోలను దరఖాస్తులకు పొందుపరచాలని ఎంపీడీవో కోరారు.